క్లుప్తంగా

బార్‌ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోండి



గుడివాడ టౌన్: నూతన ఎక్సైజ్ పాలసీ అనుసరించి బార్‌లు ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి. వెంకటరమణ తెలిపారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతన బార్ పాలసీ 2025-28కు గాను ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దరఖాస్తుతో పాటు నాన్ రీఫండబుల్ రుసుం రూ. 5 లక్షలు, అప్లికేషన్ ఫీజు రూ. 10 వేలు చెల్లించాలన్నారు. ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తే డ్రా తీస్తామన్నారు. దరఖాస్తులు ఈ నెల 18 నుంచి 28వ తేదీ లోగా స్వీకరిస్తారని పేర్కొన్నారు. పట్టణంలో 10 బార్‌లకు మాత్రమే అనుమతిస్తామని, గౌడ కులానికి చెందిన బార్‌లకు ఈనెల 29 నుంచి 30వ తేదీ వరకు డ్రా తీస్తామని తెలిపారు.

వీధిలైట్లు ఏర్పాటు

మండవల్లి: మండవల్లి గ్రామ పంచాయతీ పరిధిలో దెబ్బతిన్న వీధిలైట్లు స్థానంలో బుధవారం నూతన లైట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మెండా ఝాన్సీ మాట్లాడుతూ రాత్రి సమయంలో వీధిలైట్లు వెలగకపోతే అంధకారంగా ఉంటుందన్నారు. పోయిన లైట్లు స్థానంలో కొత్త లైట్లు ఎప్పటికప్పుడు వేయిస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు పనుల పరిశీలన



మండవల్లి: మండలంలోని పెదయెడ్లగాడి వద్ద భారీగా పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఎన్డీఏ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



కైకలూరు: స్థానిక బైపాస్ రోడ్డు ప్రారంభంలోని గంగానమ్మ జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయం వద్ద బుధవారం రెండు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 17 వరకు అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, తాత్కాలిక సర్పంచ్ కేవీఎస్ఎం.నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కైకలూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. టౌన్ పోలీసుల కథనం మేరకు గుడ్లవల్లేరు మండలం దోకిపర్రుకు చెందిన సోమగాని శ్రీకాంత్ బంధువుల దశదినకర్మ కార్యక్రమానికి ద్విచక్రవాహనంపై కైకలూరు మండలం వరహాపట్నం వెళుతుండగా కైకలూరు మాగంటి సినిమా థియేటర్ ఎదుట జాతీయ రహదారిపై ఎదురుగా మరో మోటార్‌సైకిల్ వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్ కుడికాలుకు గాయమవడంతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్ఐ ఆర్.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

థైరాయిడ్ నివారణపై అవగాహన

కొడాలి(ఘంటసాల): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుంటూరు లాం సామాజిక విజ్ఞాన కళాశాలకు చెందిన విద్యార్థినులు గ్రామీణ అవగాహన పని అనుభవంలో భాగంగా కొడాలి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు థైరాయిడ్ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్ఎం పోతన లక్ష్మీశ్వరరావు ఆధ్వర్యంలో స్కూల్లోని 8, 9 తరగతి విద్యార్థులకు థైరాయిడ్‌పై చిత్రాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

చల్లపల్లి: ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈనెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి సభలను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక చండ్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈసభలలో పార్టీ నిర్మాణం, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చిస్తారన్నారు. రైతాంగ, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చ జరుగుతుందన్నారు. మూడు వేల మంది జనసేవదళ్ వలంటీర్లతో కవాతు నిర్వహిస్తారని తెలిపారు. జన సేవాదళ్ శిక్షణ తరగతులను సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ ప్రారంభించారు. శిక్షణ పొందిన వలంటీర్లు రాష్ట్ర మహాసభల్లో కవాతులో పాల్గొంటారని ఆయన తెలిపారు. పెయ్యల వెంకటేశ్వరరావు సేవాదళ్ వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు.

దివ్యాంగులపై

కన్నెర్ర న్యాయమేనా?

ముదినేపల్లి రూరల్: దివ్యాంగ పింఛన్‌దార్లపై కూటమి ప్రభుత్వం కక్షగట్టినట్లు వ్యవహరిస్తోందని విమర్శలువెల్లువెత్తుతు. రీ వెరిఫికేషన్ పేరుతో అనేకమంది పింఛన్లను తీసివేస్తూ జారీ చేసిన ఆదేశాలతో దివ్యాంగులు కన్నీరుమున్నీరవుతున్నారు. అర్హత ఉన్నప్పటికీ తమ పింఛన్లు ఎందుకు తొలగించారంటూ ఆగ్రహంతో ప్రశ్నిస్తున్నారు. మండలవ్యాప్తంగా 1,118 మంది ప్రతినెలా దివ్యాంగ పింఛన్లు పొందుతుండగా వీరిలో 91 మందిని అనర్హులుగా తేలుస్తూ వచ్చే నెల నుంచి పింఛన్లు నిలిపివేయనున్నట్లు నోటీసులు జారీ చేశారు. అర్హులైన వారు తిరిగి అప్పీల్ చేసుకోవాలంటూ ప్రభుత్వం చెబుతున్న మాటలు కాకమ్మ కథలుగానే మిగిలిపోతాయంటూ వాపోతున్నారు.

ఆధారం పోయింది

దివ్యాంగులకు ఒక్కొక్కరికీ నెలకు రూ.6వేల చొప్పున ప్రభుత్వం పింఛన్లు అందిస్తోంది. అదేవిధంగా మంచానపడ్డవారికి నెలకు రూ.15 వేలు వంతున ఇస్తున్నారు. వీరిలో అనేకమందికి ఈ పింఛన్ల సొమ్మే జీవనాధారంగా మారిపోయింది. కుటుంబసభ్యుల ఛీత్కారాలకు గురైన వారికి ప్రతినెలా మందులు, ఆహారం నిమిత్తం పింఛన్ల మొత్తం ఆసరాగా నిలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఊహించని విధంగా పింఛన్లు తొలగించడంతో జీవనాధారం కోల్పోయామని ఏ విధంగా బతుకులు వెళ్లదీయాలని ప్రశ్నిస్తున్నారు.

ఆ డాక్టర్లు అనర్హులా...?

ప్రస్తుతం పింఛన్లు తొలగించబడిన దివ్యాంగులంతా గతంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నుంచి సదరం ధ్రువీకరణ పత్రాలు పొందారు. చైర్మన్ అధ్యక్షతన ముగ్గురు డాక్టర్ల బృందం



కంటిచూపు కోల్పోయినా పింఛన్ తీసేశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళ

నిశితంగా పరిశీలించి సదరం సర్టిఫికెట్లు జారీ చేశారు. వీరంతా నిపుణులైన డాక్టర్లే అనేది జగమెరిగిన సత్యం. ఈ సర్టిఫికెట్లను తోసిరాజంటూ కొత్తగా ఒకే డాక్టర్‌తో రీవెరిఫికేషన్ చేయించి వైకల్య శాతాన్ని తగ్గించి పింఛన్లకు దూరం చేశారు. నిపుణులైన డాక్టర్ల బృందం జారీ చేసిన సదరం సర్టిఫికెట్లు ప్రస్తుతం ఎందుకు చెల్లుబాటు కాకుండా పోతాయని ఆ డాక్టర్లు అనర్హులా అని ప్రశ్నిస్తున్నారు.

ఎలా సాధ్యం..?

దొంగ సర్టిఫికెట్లు పొంది పింఛన్లు పొందుతున్న వారిని మాత్రమే అనర్హులుగా గుర్తించి పింఛన్లు నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే పింఛన్లు పొందుతున్న వారంతా నిరుపేదలే కావడం గమనార్హం. పూట గడవని పరిస్థితుల్లో అనేకమంది ఉన్నారు. ఇలాంటి దివ్యాంగులకు ఏదో ఒక నెపంతో పింఛన్లు ఎగవేసేందుకే ప్రభుత్వం దొడ్డిదారి ఎంచుకుందనే విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి.

న్యాయం చేయాలి



మండలంలో పింఛన్లు తొలగించబడిన వారిలో అర్హులైన వారికి ప్రభుత్వం న్యాయం చేసి పింఛన్లను పునరుద్ధరించాలి. రీవెరిఫికేషన్ చేయించుకునేందుకు అవకాశం కల్పించినప్పటికీ దివ్యాంగులు ఇబ్బందులకు గురికాకుండా వాస్తవ వైకల్య శాతాన్ని నిర్ధారించాలి.

– రామిశెట్టి సత్యనారాయణ, ఎంపీపీ

ఎలా బతకాలి..?



కంటిచూపు కోల్పోయిన నేను ఎప్పటినుంచో పింఛను పొందుతున్నాను. మచిలీపట్నం జిల్లా ఆస్పత్రి వైద్య బృందం జారీ చేసిన సదరం ధ్రువీకరణ పత్రం ద్వారా పింఛను మంజూరు చేశారు. దీనిని కాదని ఇప్పుడు నాకు వైకల్య శాతం తక్కువ ఉందంటూ పింఛను తొలగించడం ఏమేరకు న్యాయం. పింఛనుపై ఆధారపడ్డ నేనెలా బతకాలో అర్థం కావడం లేదు.

– అనగాని కోటేశ్వరరావు, ముదినేపల్లి

దివ్యాంగుల పింఛన్‌లు తగ్గించడం దారుణం

గుడివాడ టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల పింఛన్‌లు తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కృష్ణా జిల్లాలో డీఎంహెచ్ఓ ఇచ్చిన సదరం సర్టిఫికెట్‌లు 1,097 ఉన్నాయని వీరికి గత ప్రభుత్వంలో రూ. 10 వేల నుంచి రూ. 15 వేలు పింఛన్‌లు అందాయన్నారు. వీటిని తగ్గించడానికి కూటమి ప్రభుత్వం మోసపూరిత కుట్ర పన్నిందన్నారు. సదరం సర్టిఫికెట్‌ల ఎంక్వయిరీ పేరుతో పింఛన్‌లు కుదించడం ఒక ఎత్తుగడగా భావించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 34,097 మంది దివ్యాంగులకు పింఛన్ ఇస్తుంటే వాటిలో కనీసం 10శాతం తగ్గించాలని ప్రభుత్వం అధికారులకు సూచనలు ఇచ్చిందన్నారు. దీని వలన సుమారు 3,987 మందికి నోటీసులు ఇచ్చారన్నారు. ఇది దారుణమైన విషయం అని పేర్కొన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్ విషయంలో పునరాలోచించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి. రజిని, ఆర్. కొండ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం, బి. ప్రసాదు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

దరఖాస్తుల స్వీకరణ

మొవ్వ: మండలంలో రద్దయిన దివ్యాంగుల, మంచానికే పరిమితమైన రోగుల పెన్షన్ల పునఃపరిశీలన కోసం అధికారులు బుధవారం నుంచి లబ్ధిదారుల దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్లు తొలగించిన లబ్ధిదారుల నుంచి ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు దరఖాస్తులు స్వీకరించారు. వీటితో పాటు సదరం సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సచివాలయ సిబ్బంది ఇచ్చిన నోటీసులను తీసుకున్నారు. మొవ్వ మండలంలో 370 మందికి పెన్షన్లు రద్దు అయిన నేపథ్యంలో నేటికి 60 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. నోటీసు అందించిన నాటి నుంచి నెల లోపల పునఃపరిశీలనకు దరఖాస్తులు అందించాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.



మొవ్వలో దరఖాస్తులు తీసుకుంటున్న ఎంపీడీఓ

ముంపు బారిన పడిన వరి పంటలో జాగ్రత్తలు తీసుకోండి

కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ సుధారాణి

పమిడిముక్కల: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వివిధ దశల్లో ఉన్న వరి పంటలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి పేర్కొన్నారు. మండలంలోని మర్రివాడ, గోపువానిపాలెం గ్రామాల్లో బుధవారం శాస్త్రవేత్తల బృందం క్షేత్ర సందర్శనలు చేసి రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. పిలకల దశలో సాధారణ రకాలు ఐదు రోజుల వరకు నీటమునిగినా బతికే అవకాశం ఉందన్నారు. పిలకల దశలో వరిపంట నీట మునిగితే నీరు బయటకు తీసిన తరువాత ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని సుధారాణి తెలిపారు. ఈ విధంగా బూస్టర్ డోస్ వేసుకోవడం వలన మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకొంటుందన్నారు. కోలుకొన్న తరువాత కుళ్లు తెగులు రాకుండా లీటర్ నీటికి ఒక గ్రామ్ కార్బెండజిం లేదా రెండు గ్రాముల కార్బెండజిం, మాంకోజెబ్ కలిపిన మిశ్రమం పిచికారీ చేసుకోవాలని తెలిపారు. పొడతెగులు వ్యాప్తికి హెక్సాకొనజోల్ 2 మి.లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. చెరకులో తెల్లదోమ ఉధృతికి ఎకరాకు ఇమిడాక్లోప్రిడ్ 50 మిలీ లీటర్లు పిచికారీ చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో చెరకు పరిశోధనా స్థానం శాస్త్రవేత్త విజయ్‌భాస్కరరెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు రేవతి, నవీన్, ఏఓ గణేష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వై.పిచ్చేశ్వరరావు, ఏఈఓ సునీల్ పాల్గొన్నారు.



చెరకు తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం

వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేయాలని పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కైకలూరు పార్టీ కార్యాలయంలో ఇటీవల రాష్ట్ర స్థాయి పదవుల్లో నియమితులైన చింతలపూడి నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర బీసీ సెల్ విభాగ కార్యదర్శి కుక్కల ధర్మరాజు, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి మల్నీడి మోహనకృష్ణ డీఎన్నార్‌ను మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. రాష్ట్ర స్థాయి పదవులు రావడానికి సిఫార్సు చేసిన డీఎన్నార్‌కు పూలమాల, శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్ర స్థాయిలో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని డీఎన్నార్ వారితో చెప్పారు. కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ పార్టీ నాయకులు చిత్తపూరి శేఖర్, మహమ్మద్ ఉమర్ షరీఫ్, కోరిమిల్లి హేమంత్, దల్లి మోహన రెడ్డి, తానిగడప రామకృష్ణ, ముమ్మిడి దుర్గారావు, కంభపు అప్పలరెడ్డి పాల్గొన్నారు.



చింతలపూడికి చెందిన మల్నీడి బాబీ, కార్యకర్తలతో జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్



డీఎన్నార్‌ను అభినందిస్తున్న కుక్కల ధర్మరాజు

ఆక్వా రంగాన్ని ప్రభుత్వాలు ఆదుకోవాలి

మచిలీపట్నంటౌన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల ప్రకటన నేపథ్యంలో ఆక్వా రైతులను, ఆక్వా రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని మచిలీపట్నంలో బుధవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఏపీ రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగినది. ఈ సమావేశంలో ఆక్వా రైతుల సంఘం నాయకులు రావి వెంకట్రావు మాట్లాడుతూ ఆక్వా రంగం నుంచి మన రాష్ట్రానికి విదేశీ మారకద్రవ్యం, మార్కెట్ సెస్‌ల రూపంలో కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్నా, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎ పి కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, ఆక్వా రైతుల సంఘం నాయకులు పుప్పాల నరసింహరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కే శివనాగేంద్రం,ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, రైతు నాయకులు అజయ్ ఘోష్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియానికి ఉత్తమ సేవా అవార్డు

గుడివాడ టౌన్: యోగాంధ్ర–2025 నిర్వహణలో ఎన్టీఆర్ స్టేడియానికి ఉత్తమ సేవా అవార్డు అందినట్లు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి యలవర్తి శ్రీనివాసరావు, కె. రంగప్రసాద్ బుధవారం తెలిపారు. స్టేడియంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆరు వేల మంది పాల్గొనడం, గ్రౌండ్ అంతా గ్రీన్ మ్యాట్ వేయడం, గుడివాడ పరిసర ప్రాంత ప్రజలకు, ఉద్యోగులకు, వ్యాపారులకు, ఇతరులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినందుకు గాను ఈ అవార్డు వచ్చిందని వారు వివరించారు.

నియోజకవర్గ స్థాయి పోటీలు

ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి యలవర్తి శ్రీనివాసరావు, కె. రంగప్రసాద్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకుని క్రీడాదినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో గుడివాడ పరిసర ప్రాంత క్రీడాకారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



స్టేడియానికి వచ్చిన అవార్డు ప్రదర్శిస్తున్న ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి

అన్నదాతకు యూరియా కష్టాలు

పట్టించుకోని అధికారులు

పెదపారుపూడి: యూరియా కోసం అన్నదాతలు పడుతున్న ఆవేదన అరణ్యరోదనగానే మిగులుతోంది. కొన్ని రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వరి పంటకు ప్రస్తుతం యూరియా అవసరం ఉందని రైతులు చెబుతున్నారు. క్లాంపెక్స్ ఎరువు పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా యూరియా కోసం అష్టకష్టాలు పడుతున్నామని వాపోతున్నారు. 2019–2024 సంవత్సరంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎప్పుడూ ఎరువుల కొరత ఉత్పన్నం కాలేదని అంటున్నారు. అప్పట్లో ఆర్‌బీకేలకు ప్రాధాన్యం ఇవ్వటంతో రైతుకు గ్రామంలోనే అవసరమైన ఎరువులు లభించేవని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఖరీఫ్ సీజన్‌కు అరకొరగా యూరియా సరఫరా చేయటంతో అందరికీ అందటం లేదు. మండలంలోని పలు గ్రామాల్లోని రైతులకు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నాలుగు రోజుల నుంచి తిరుగుతున్నా..

మండలంలోని ఈదులమద్దాలి గ్రామానికి చెందిన శివాజీ అనే రైతు సుమారు 40 ఎకరాల వరి పంట కౌలుకు సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం యూరియా కోసం నాలుగు రోజుల నుంచి సొసైటీలకు, గుడివాడలోని ప్రైవేట్ ఎరువుల షాపుల వద్దకు వెళ్లి యూరియా కావాలని అడుగుతుంటే ఒక్కరూ కూడ కట్ట ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వరి పంట ఎలా సాగు చేయాల్లో అర్థం కావటం లేదని వాపోయాడు. యలమర్రు, వెంట్రప్రగడ, వానపాముల, దోసపాడు, భూషణుగుళ్ల తదితర గ్రామాల్లో కూడా యూరియా బస్తా దొరకటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని చెబుతున్నారు.



వానపాముల పీఏసీఎస్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు (ఫైల్)

ఇంత ఇబ్బంది ఎప్పుడూ పడలేదు

20 ఎకరాల వరి పంట కౌలుకు సాగు చేస్తున్నా. ప్రస్తుతం కట్ట యూరియా కోసం గుడివాడ ప్రైవేట్ షాపులకు వెళితే వేరే రకం ఎరువులను లింక్ పెట్టి.. వాటిని కొంటేనే యూరియా ఇస్తున్నారు. సొసైటీకి యూరియా వస్తే ఎప్పుడు వచ్చిందో ఎప్పుడు అయిపోయిందో తెలీటం లేదు.

– మోచర్ల స్వామి, కొర్నిపాడు

వారం నుంచి యూరియా కోసం తిరుగుతున్నా

20 ఎకరాల వరి పంట సాగు చేస్తున్నా. ప్రస్తుతం 15 బస్తాల యూరియా అవసరం ఉంది. వారం నుంచి యూరియా కోసం తిరుగుతున్నా ఒక్క బస్తా కూడ దొరక లేదు. ఏమి చేయాల్లో అర్థం కావడం లేదు. వ్యవసాయాధికారులు పట్టించుకోవటం లేదు.

– బోయిన శివయ్య, రైతు, మోపర్రు

కరాటే పోటీల్లో గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించారని గౌతమ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ పి. లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ ఒంగోలులో నిర్వహించిన సికోకాయ్ కరాటే ఆంధ్రప్రదేశ్, స్పోర్ట్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ప్రకాశం జిల్లా అనుబంధ సంస్థ అయిన సిద్ధార్థ కరాటే–డో–అకాడమీ నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2025లో తమ క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. అండర్–14 బాలికల వ్యక్తిగత కటా విభాగంలో బి. చాతుర్య బంగారు, కె. ధాత్రిక బంగారు, ఎస్. రిషిత వెండి, ఎస్. కారుణ్య కాంస్య పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్ ఎస్. వెంకటేశ్వరరావును పాఠశాల ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి ప్రశాంతి అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసాద్

రైతు సంక్షేమమే లక్ష్యం

గుడ్లవల్లేరు: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడ్లవల్లేరు మండల పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా ఎంపికైన వెనిగండ్ల నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారానికి బుధవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా రైతాంగానికి చేయూతనిచ్చే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. త్రిసభ్య కమిటీలో వి. నాగేశ్వరరావు, డైరక్టర్లు నవాబు, సీహెచ్. సూర్య ప్రకాశరావు ఉంటారన్నారు. త్రిసభ్య కమిటీ సభ్యులను నాయకులు సత్కరించారు.

రాంప్రసాద్‌ను కలిసిన నాయకులు

గుడ్లవల్లేరు బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు బుధవారం బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రాంప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా టీడీపీ ప్రధాన కార్యాలయంలో కలిశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అగ్నిహోత్ర ఫణిగోపాల్, గుడివాడ డివిజన్ అధ్యక్షుడు భరతుల రమణమూర్తి, సెక్రటరి వేదాంతం అప్పలాచార్యులు, కోశాధికారి లంక గిరిచంద్ర శర్మ తదితరులు అభినందించారు. అనంతరం మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న 37 మందికి సీఎం సహాయనిధికి సంబంధించిన సీఎంఆర్ చెక్కులను పంపిణీ చేశారు.



పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే రాము

ఆర్‌డబ్ల్యూఎస్ పనుల పూర్తికి సహకరించాలి

ఘంటసాల: మండలంలోని తాగునీటి సమస్యలను పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యపై, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులపై డీఈఈ ప్రసన్నతో ఎంపీడీవో సుబ్బారావు బుధవారం చర్చించారు. ఆయా పనులను సకాలంలో పూర్తి చేయడానికి సహకరించాలని ఎంపీడీవో కోరారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి మండలానికి వచ్చిన ప్రసన్నను మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సుగుణ కుమారితో కలసి దుశ్శాలువాతో సత్కరించారు.

దసరా ఉత్సవాలకు అంకురార్పణ

కృత్తివెన్ను: దసరా ఉత్సవాలకు సంభందించిన పనులను పసుపుకొట్టే కార్యక్రమంతో ప్రారంభించారు. మండల పరిధిలోని నీలిపూడిలో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయం వద్ద బుధవారం గ్రామంలోని ముత్తయిదువులు ముందుగా 108 బిందెలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపి దసరా ఉత్సవాల పనుల ప్రారంభానికి ముందుగా పసుపు కొట్టి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ప్రతి ఏటా ఉత్సవాలకు ముందుగా అమ్మవారిని జలంతో అభిషేకించి మహిళలు పసుపు కొట్టి పనులకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు పుప్పాల రామాంజనేయులు (బుజ్జి) తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



నీలిపూడిలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద పసుపుకొడుతున్న మహిళలు

ఇళ్లలో మురుగునీరంతా సీసీ రోడ్డుపైనే!

ఈదులమద్దాలి(పెదపారుపూడి): మండలంలోని ఈదులమద్దాలిలోని వంగవీటి మోహనరంగా విగ్రహం ఉన్న సందులో సీసీ రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ లేకపోవటంతో ఇళ్లలో మురుగునీరు అంతా రోడ్డుపై నిల్వ చేరింది. దీంతో దుర్వాసన వస్తుందని గ్రామస్తులు అంటున్నారు. ఆరు నెలల నుంచి రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తున్నా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నా కనీసం బ్లీచింగ్ చల్లించటం లేదని ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో దోమలు ఎక్కువై కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై నిల్వ చేరిన మురుగునీరు

58 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలంలోని కూచిపూడి ఆరోగ్య ఉప కేంద్రంలో అడ్వాన్స్‌డ్ మొబైల్ డయాగ్నస్టిక్ యూనిట్ మొబైల్ బస్ ద్వారా బుధవారం 58 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ సిహెచ్ రాజేశ్వరి ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్ డాక్టర్ మెహనాజ్, రేడియాలజిస్ట్ డాక్టర్ ఎం.బాలచంద్ర, ఎక్స్‌రే టెక్నీషియన్ ఎం.ప్రభాకర్‌రావు, ల్యాబ్ టెక్నీషియన్ జి.రంజిత్‌కుమార్ తదితరులతో పాటు పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ విద్యార్థులు పాల్గొని మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్ స్కానింగ్, బ్రెస్ట్ క్యాన్సర్ మొదలైన పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు హెల్త్ సూపర్‌వైజర్ బి.విజయ్‌కుమార్,హెల్త్ అసిస్టెంట్ కె.రామాంజనేయులు, సీహెచ్ఓ కే దివ్య, ఏఎన్ఎం జి.సమిత ఆశ కార్యకర్తలు సహకరించారు.



పరీక్షలకు హాజరైన వైద్య అధికారులు, సిబ్బంది